క్లుప్తంగా

ఆత్మరక్షణకు కరాటే దోహదం

ఖానాపురం:విద్యార్థినుల ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్ హైస్కూల్‌లో గురువారం కరాటే శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినుల్లో క్రమశిక్షణ, దేహధారుడ్యం, ఆత్మస్థైర్యం నెలకొల్పడానికి శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు పద్మావతి, సారంగపాణి, సరస్వతి, రాజేందర్, బాలాజీ, రాజు, సురేందర్, ప్రభాకర్, నిర్మలాదేవి, సుభద్ర, వెంకటలక్ష్మి, ఏకాంబ్రం పాల్గొన్నారు.

స్పోర్ట్స్ టీ షర్ట్స్ పంపిణీ



రాయపర్తి: సీఎం కప్ క్రీడాపోటీల్లో భాగంగా గ్రామీణస్థాయిలో ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి స్పోర్ట్స్ టీ షర్ట్‌లను గురువారం అందించారు. కార్యక్రమంలో పీఈటీలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రాయపర్తి: గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆపార్టీ పాలకుర్తి అసెంబ్లీ కో కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్‌రావు కోరారు. గురువారం మండలంలోని కొండూరు గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. బూత్ అధ్యక్షులుగా జక్కుల సందీప్, ముత్యాల అనిల్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నూనె అనిల్, జిల్లా ప్రచారకార్యదర్శి రవి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రావణ్‌కుమార్, మంచాల సుమన్, దాసరి భాస్కర్, అజయ్, రాజు, దేవరాజ్, రాకేష్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వండి

నల్లబెల్లి: ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు పులి రమేశ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ శైలజకు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని కోరారు. బట్టు సాంబయ్య, జాటోత్ రమేశ్ పాల్గొన్నారు.

ఎంజేపీ ప్రిన్సిపాల్‌ను తొలగించాలి



ఖానాపురం: మండలంలోని ఐనపల్లి మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాల ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, స్వేరోస్ ఇంటర్నేషనల్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ కోరారు. ఈ మేరకు అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఔటింగ్‌కు వెళ్లిన విద్యార్థులు ఆలస్యంగా వచ్చారని ప్రిన్సిపాల్ చలిలో రెండున్నర గంటలు నిలబెట్టడం బాధాకరమన్నారు. పాఠశాలలోకి అనుమతించాలని పోలీస్ సిబ్బంది సమాచారం ఇచ్చినా స్పందించకపోవడం తీరుతో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం అర్థమవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎంజేపీ ప్రిన్సిపాల్‌ను తొలగించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

కమిటీ బాధ్యులకు సన్మానం



రాయపర్తి: ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన తిర్మలాయపల్లి గ్రామానికి చెందిన ముద్రబోయిన వెంకటేశ్వర్లుతోపాటు కమిటీని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి గురువారం సన్మానించారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, మహేందర్‌రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రామశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట: మండలంలోని జల్లీ గ్రామానికి చెందిన మహ్మద్ ఫాతిమా, బోడ సుమన్‌లకు ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామ పార్టీ అధ్యక్షుడు బాదావత్ బాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ రఫి, మహ్మద్ సుభాన్, రజాక్, కిషన్, విజేందర్, ప్రవీణ్, బాలరాజు, ఏకాంబరం, రంజిత్ ఉన్నారు.

'స్థానికం'పై ఫోకస్

- గ్రామాల్లో జోరుగా కొనసాగుతున్న చర్చ
- బరిలోకి దిగేందుకు యువత ఆసక్తి
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ
- మండలంలో 41,168 మంది ఓటర్లు
- 33 జీపీలు.. 286 వార్డులు

సంగెం: స్థానిక సంస్థల ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చలు మొదలయ్యాయి. కులగణన ప్రక్రియ పూర్తయిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారనే సమాచారంతో ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న నాయకులు, ఆశావహులు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. స్థానిక సమరంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు రాజకీయ వారసులతోపాటుగా గతంలో ఎన్నడూ ప్రత్యక్ష రాజకీయాల్లో లేనివారు సైతం రాజకీయ అరంగ్రేటం చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. ఇటీవల పంచాయతీ ఎన్నికలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయడం, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియలు వేగవంతం కావడంతో ఆశావహుల్లో ఆసక్తి పెరిగింది. ఇక రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపగానే బరిలోకి దూకేందుకు అవసరమైన అంగబలం, అర్థబలం సమకూర్చుకుంటున్నట్లు సమాచారం.

జీపీలు, ఓటర్ల వివరాలు	
గ్రామపంచాయతీలు	33
వార్డులు	286
మొత్తం ఓటర్లు	41,168
పురుషులు	20,169
స్త్రీలు	20,998
ఇతరులు	ఒకరు

రిజర్వేషన్ల సమీకరణాలు

స్థానిక సమరంలో పార్టీ బలం కంటే వ్యక్తిగత ఇమేజ్ ఎక్కువగా పనిచేస్తుంది. దీంతో పలువురు ఆశావహులు నిత్యం ప్రజల్లో తిరుగుతూ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. రిజర్వేషన్లపై అంచనాలు వేసుకుంటూ తమ ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.

రిజర్వేషన్లపై చర్చ

స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా.. లేక కొత్తగా రిజర్వేషన్లు చేస్తారా.. అనేది తేలాల్సి ఉంది. కులగణన తర్వాత రిజర్వేషన్లలో తప్పకుండా మార్పులుంటాయని ఫలానా రిజర్వేషన్ వస్తే నేను, ఫలానా రిజర్వేషన్ వస్తే నీవు బరిలో నిలుద్దామంటూ ఒకరికొకరు సహాయ సహకారాలు అందించుకునేందుకు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

ఈ సారి ఎన్నికల బరిలో దిగేందుకు యువత ముందుకొస్తుండడంతో గట్టి పోటీ తప్పదనే ప్రచారం కూడా ఉంది. పార్టీలకతీతంగా జరిగే ఎన్నికలైనప్పటికీ పరోక్ష మద్దతు ప్రభావం ఉంటుంది. కాబట్టి మండలంలో గత వైభవాన్ని నిలుపుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ, అన్ని స్థానాల్లో తమ సత్తా చాటాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ, స్థానిక సంస్థల్లో కొన్ని స్థానాల్లోనైనా పట్టుసాధించేందుకు బీజేపీ పావులు కదుపుతున్నాయి.



సంగెం గ్రామపంచాయతీ కార్యాలయం

ఎన్నికలకు సిద్ధం



పంచాయతీ ఎన్నికలకు అవసరమైన ప్రక్రియ పూర్తయింది. వార్డుల విభజన, వార్డుల్లో ఓటర్ల సర్దుబాటు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి ప్రక్రియలు పూర్తయ్యాయి. బ్యాలట్ పేపర్లు సైతం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయి. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కొమురయ్య, ఎంపీఓ

ఘనంగా అయ్యప్ప పడిపూజ



చెన్నారావుపేట: పూజలో పాల్గొన్న శ్రీనివాస్

చెన్నారావుపేట: మండల కేంద్రంలోని భూషబోయిన కొంరయ్య ఇంటిలో గురువారం అయ్యప్ప మహా పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివకుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాలాధారులు భూషబోయిన రాజేష్, తేజశ్రీ, సతీష్, శ్రవంతి ఉన్నారు.

అయ్యప్పస్వామికి అభిషేక పూజలు

నర్సంపేట: నర్సంపేట పట్టణంలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయంలో 24వ మండల పూజా మహోత్సవాలు గురువారం ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్‌గుప్తా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్, చింతల కమలాకర్‌రెడ్డి, దొడ్డ రవీందర్, చంద్రశేఖరం, శ్రీరాంఈశ్వరయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: వర్ధన్నపేట పట్టణంలోని సాయిబాబా ఆలయ ప్రాంగణంలో గురువారం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత పరుపాటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. పూజ అనంతరం అయ్యప్ప స్వాములు, భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కొత్త ఆర్ఓఆర్ చట్టంతో రైతులకు మేలు

పర్వతగిరి: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించిన తెలంగాణ భూ భారతి భూమిపై హక్కుల రికార్డు చట్టం రైతులకు మేలు జరుగుతుందని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భూక్య కన్న అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024 కొత్త ఆర్ఓఆర్ చట్టం రైతులకు చుట్ట అనే నినాదంతో భూధార్, గ్రామస్థాయిలోనే రెవెన్యూ సేవలు, చట్టబద్ధ హక్కుల నమోదు, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, పకడ్బందీగా మ్యూటేషన్, భూ రికార్డుల సవరణ, భూ హక్కుల కల్పన ద్వారా తెలంగాణ రైతులకు ఎంతో మేలు చేస్తుందన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే అందించాలి

ఖానాపురం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల వేతనాలు తక్షణమే అందించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు ఉస్మాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27, 28 తేదీల్లో చేపట్టనున్న సమ్మె నోటీసును ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు బోడ వీరన్న, భిక్షనాయక్, వెంకటమ్మ, యాకుబ్, సోమక్క, సమ్మక్క, ప్రసన్న, పార్వతి, కవిత, శైలజ, నర్సయ్య, భిక్షం, స్వామి, మాణిక్యం పాల్గొన్నారు.

దుగ్గొండి: తమ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని ఈనెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మె చేస్తున్నామని ఎంపీడీఓ అరుంధతికి పారిశుధ్య కార్మికులు గురువారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పుట్టపాక రాజేందర్, ముస్కు రాజు, శ్రీరామోజు భిక్షపతి, రాంబాబు, స్వరూప,. రాజు, నర్సయ్య, రవి పాల్గొన్నారు.



దుగ్గొండి: వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కేంద్ర మంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలి



నర్సంపేటలో నిరసన తెలుపుతున్న నాయకులు



గీసుకొండ: మచ్చాపూర్‌లో..

నర్సంపేట/నర్సంపేట రూరల్ : అంబేడ్కర్‌పై అవహేళనగా మాట్లాడి బహుజన సమాజాన్ని అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ, ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో గురువారం అంబేడ్కర్ సెంటర్‌లో, మాధన్నపేటలో నిరసన వ్యక్తం చేశారు. కుక్కల యాకయ్య, రాజేష్, సునీత, సతీష్, శీను, నిర్మల, సందీప్, ఖాజా, ప్రమీల, సదానందం, రమేష్, రవి, రాజేందర్, సమ్మయ్య పాల్గొన్నారు.

అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

గీసుకొండ/రాయపర్తి: కేంద్ర మంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. మండలంలోని వరంగల్–నర్సంపేట రహదారి మచ్చాపూర్ స్టేజి వద్ద ఎంసీపీఐ(యూ) నాయకులు, కార్యకర్తలు గురువారం ధర్నా చేపట్టారు. అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. అంబేడ్కర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు చిలుముల కృష్ణ ఆధ్వర్యంలో రాయపర్తి మండలం కేశవాపురంలో నిరసన తెలిపారు. గోనె కుమారస్వామి, సంధ్య, సురేశ్, రవి, నారాయణ, సాయిరాం, లలిత, రాజమౌళి, సుధాకర్, రాయపర్తిలో కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు సుధాకర్, ప్రశాంత్, సతీష్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఖాదర్‌పేటలో సర్వే చేస్తున్న అధికారులు



పర్వతగిరి: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చెన్నారావుపేట: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు ఉంటుందని ఖాదర్‌పేట కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గూడ మహేందర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని ఖాదర్‌పేటలో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వీరన్నతో కలిసి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో పెండ్లి ఐలయ్య, నిలిగొండ సూరయ్య, మధు, పెంతల రాజు, పెండ్లి రాజేందర్, పెద్ది చంద్రయ్య, యాదగిరి, మల్లయ్య, రాజశేఖర్, కుమారస్వామి ఉన్నారు.

రాయపర్తి: మండలంలోని గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని గణేషకుంటతండాలో పంచాయతీకార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సిబ్బంది గారె వీరస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పరిశీలన

పర్వతగిరి: మండలంలోని పర్వతగిరి, కల్లెడ, బూరుగుమల్ల, దౌలత్‌నగర్ గ్రామాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీఓ మాలోతు శంకర్‌నాయక్ గురువారం పరిశీలించారు. సర్వేలో తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సర్వేను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని తెలిపారు. ఎంపీఓ పాక శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడి మృతి

సంగెం: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చింతలపల్లికి చెందిన వేల్పుల రాజాలు(80) అనారోగ్య సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈనెల 17న రాత్రి భార్య లక్ష్మమ్మ నిద్రపోయిన తర్వాత రాజాలు పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటున్నాడు. గమనించిన భార్య, సమీప బంధువులతో సాయంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

నివాళి

నల్లబెల్లి: ఎంసీపీఐ(యూ) నాయకుడు మంద సంజీవ మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజసాహెబ్ అన్నారు. సంజీవ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కాగా సంజీవ నేత్రాలను వరంగల్‌లోని ప్రాంతీయ నేత్రవైద్య శాలలో దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నాయకులు వంగల రాగ సుధ, నాగెల్లి కొంరయ్య, దామ సాంబయ్య, మార్తా నాగరాజు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి



రైతును సన్మానిస్తున్న బీఎం రమేష్, తదితరులు

చెన్నారావుపేట: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే అన్ని రకాల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని నర్సంపేట ఏడీబీ బ్రాంచ్ మేనేజర్ కోరె రమేష్ అన్నారు. ఈ మేరకు మండలంలోని లింగాపురంలో రైతులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు క్రాప్‌లోన్స్, మార్టిగేజ్ లోన్స్, కిసాన్ రిస్ సమృద్ధి, అగ్రి ఎంటర్‌ప్రైజ్ లోన్స్‌తోపాటు పలు రకాల లోన్స్ అందిస్తున్నామని అన్నారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వం అందించే సబ్సిడీలపై అవగాహన పెంచుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు రుణాలు పొందాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి వ్యక్తిగత ఖాతా వివరాలు, వన్‌టైం పాస్‌వర్డ్ చేప్పకూడదన్నారు. అనంతరం అన్నదాత మహోత్సవాల్లో భాగంగా రైతులను సన్మానించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రాజేందర్, మాజీ సర్పంచ్ రమేష్, సంతోష్, కరుణాకర్, రైతులు దూడయ్య, అశోక్, శంకర్, గోపతి కుమారస్వామి, కొంరయ్య ఉన్నారు.

మాల మహానాడు నాయకుల అరెస్టు



గీసుకొండ పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

గీసుకొండ: ఎస్సీ వర్గీకరణకు నిరసనగా అసెంబ్లీ ముట్టడికి బయల్దేరిన మాల మహానాడు నాయకులను గీసుకొండ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి తుప్పరి నర్సింహస్వామి, మండల కమిటీ అధ్యక్షులు నాంపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పసుల భిక్షపతి, నాయకులు బాలరాజు, సతీష్, సారంగం, సంపత్, కుమార్, నాగరాజుతో పాటు పలువురిని అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై వదిలివేశారు.

చెన్నారావుపేట: మండలంలోని మాలమహానాడు నాయకులను పోలీసులు ముందుస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మాలమహానాడు నాయకులు చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. డివిజన్ అధ్యక్షులు పత్రి కుమారస్వామి, మండల అధ్యక్షుడు యశోద నర్సింగం, తదితరులు ఉన్నారు.

మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఖానాపురం: చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి అన్నారు. మండలంలోని అశోక్‌నగర్‌లో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో సఖీ సెంటర్ బాధ్యులు సఖీ సేవలు, మహిళల హక్కులు, చట్టాలపై మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖీ సెంటర్లను ఏర్పాటు చేశాయన్నారు. అత్యవసర పరిస్థితుల్లో భయటకు రాలేని మహిళలు హెల్ప్‌లైన్ 181కు కాల్ చేసి సమాచారం అందిస్తే సాయం అందించనున్నట్లు వివరించారు. అనంతరం మహిళల రక్షణపై సఖీ కేంద్రం ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సఖీ బాధ్యులు తిరుమల, మంజుల, మహిళా సంఘం బాధ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సఖీ నిర్వాహకులు

ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండాలి

వర్ధన్నపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు అందుబాటులో ఉండి పేదలకు మెరుగైన సేవలు అందించి వారిలో నమ్మకాన్ని పెంచాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మైన సురేష్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పత్తి భాను ప్రసాద్ అన్నారు. గురువారం వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్ర వాతవరణం ఉండేలా చూడాలన్నారు. ఆస్పత్రిలోని పలు విభాగాల గదులను సందర్శించారు. వార్డుల్లో ఉన్న రోగులు, ప్రసూతి అయిన వారిని ఎలాంటి సేవలు అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. ఆస్పత్రి సూపంటెండెంట్ డాక్టర్ రామ్మూర్తి, డాక్టర్ విజయకుమార్, కాంగ్రెస్ నాయకులు తూల్ల రవి, మల్లెపాక సమ్మయ్య, సూరారపు నిరంజన్, పాక సుజాత పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ అంతరాయం

వర్ధన్నపేట: మండలంలోని ల్యాబర్తి సబ్ స్టేషన్ పరిధిలోని డీసీ తండా ఫీడర్ నేడు(శుక్రవారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 132 కేవీ లైన్ మరమ్మతు పనులు చేపట్టడం వల్ల ఈ అంతరాయం ఏర్పడిందని మరమ్మతు పనులు పూర్తి కాగానే విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.

పరామర్శ

రాయపర్తి: మండలంలోని కొలన్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పులిశెర్ల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కృష్ణారెడ్డి, కృష్ణమాచార్యులు, యాదగిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

తగ్గిన వేరుశనగ దిగుబడి



వేరుశనగ కాయలను చూపుతున్న రైతు

రాయపర్తి: ఆరుగాలం కష్టించి పండించిన రైతన్నకు ఏం మిగలడం లేదు. మండల కేంద్రంలోని ఓ రైతు దగ్గర కౌలుకు తీసుకున్న భూమిలో రైతు రాము వేరుశనగ సాగు చేశాడు. గతేడాది ఇదే భూమిలో వేరుశనగ పంట వేశాడు. దిగుబడి మంచిగా వచ్చింది. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో సాగు చేయగా దిగుబడి చాలా వరకు తగ్గింది. పెట్టుబడి కూడా రాలేదని, కూలీల ఖర్చుకే అయ్యేటట్లుందని ఆవేదన వ్యక్తం చేశాడు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో నష్టం వచ్చినట్లు తెలిపాడు. పెట్టుబడి రూ.2 లక్షలు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని తెలిపాడు.

మండల కమిటీ ఎన్నిక



బషీర్, అధ్యక్షుడు

నెక్కొండ: బ్యాండ్, వాయిద్య కళాకారుల సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షుడు మహ్మద్ మౌలానా తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో గురువారం సంఘం సమావేశం అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా మహ్మద్ బషీర్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రాజ్‌హమ్మద్, ప్రధాన కార్యదర్శిగా జంపాల కుమార్, సహాయ కార్యదర్శిగా మంకాల సాంబయ్య ఎన్నికయ్యారని ఆయన పేర్కొన్నారు. సంఘం కో–కన్వీనర్ మద్దికుంట్ల యాదగిరి, మహ్మద్ చాంద్‌పాషా, మడిపెద్ది వెంకన్న, పోడేటి రాజు, బాబు పాల్గొన్నారు.

నర్సంపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న లక్ష్మీరామానంద్

నర్సంపేట: నర్సంపేట పట్టణ అభివృద్ధి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితోనే సాధ్యమని కౌన్సిలర్, పీసీసీ సభ్యుడు పెండెం లక్ష్మీరామానంద్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 19వ వార్డులో గురువారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధుల ద్వారా రూ.కోటి 60లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు రాజేందర్, విజయ్‌కుమార్, వినోదసాంబయ్య, అంజలిఅశోక్, మాజీ వైస్ ఎంపీపీ సాంబరెడ్డి, తిరుపతి, నాయకులు కమలాకర్ రెడ్డి, తుమ్మలపల్లి సందీప్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ బహూకరణ



కూలర్ బహూకరిస్తున్న దాతలు

నర్సంపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ఆధ్వర్యంలో గురువారం వాటర్ కూలర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై స్పందించి వాటర్ కూలర్‌ను అందజేసిన బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. బ్యాంకు ప్రతినిధులు రాజ్‌కుమార్, ఆయుష్, భగత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, ఉపాధ్యాయులు శంకరయ్య, సురేందర్, కల్పన, ప్రభాకర్ పాల్గొన్నారు.